వర్షాకాలం.. పశువులు భద్రం

వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పులకు మనుషుల లాగానే జంతువులకు పలు అనారోగ్య పరిస్థితులు తలెత్తుతాయి. పాడి పశువులు, గొర్రెలు, మేకల కాపరులు అప్రమత్తంగా లేకపోతే పాడి పశువులకుపాల ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మేకలు, గొర్రెలకు ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.

- గేదెలు, గొర్రెలు, మేకల కాపరుల్లో అప్రమత్తత అవసరం
- వీపీసీలో రోజూ 150 నుంచి 200 జంతువులకు సేవలు


గేదెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రంగస్వామి

కడప మండల పరిధిలోని పశువులు, ఆవులు, గొర్రెల వివరాలిలా ఉన్నాయి

రకం	వాటి సంఖ్య
గేదెలు	8044
ఆవులు	498
గొర్రెలు	4585
మేకలు	2751
పందులు	40
కోళ్లు	22441
పిల్లులు	2015
కుక్కలు	3733

కడప అగ్రికల్చర్: కడప బహుళార్థ పశు వైద్య శాలలో ప్రతి రోజూ 150 నుంచి 200 గేదెలు, ఆవులు, కుక్కలు, గొర్రెలు మేకలు, పిల్లులు, కోళ్లు, కుందేళ్లు, పావురాల్లు, చిలకల వంటి వాటికి వైద్య సేవలు అందిస్తున్నారు. వీటికి ఏ పాటి జబ్బు చేసినా తక్షణమే పశు వైద్యశాలను సంప్రదించి సేవలు పొందాలని వెటర్నీరీ పాలి క్లీనిక్ వైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, గాలికుంటు నంజు జ్వరం, జబ్బవాపు వంటి వ్యాదులు సోకే అవకాశం ఉంటుంది. పరిసరాల ప్రభావం, వరదనీరు, మొలిచిన పచ్చిక గడ్డిపై కీట కాలతోనూ, మేత తినడంతోనూ వ్యాధులు సోకి అనారోగ్యానికి గురవుతుంటాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గి చివరకు చనిపోయే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులపట్ల రైతులు, గొర్రెలు, మేకల యజమానులు అప్రమత్తంగా ఉండటూ నిరోధక టీకాలు వేయించాలి. పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అన్ని ప్రాణులకు వైద్య సేవలు: కడపలోని బహుళార్థ పశు వైద్యశాలలో పశువులతోపాటు మేకలు, గొర్రెలు, కుక్కలు, పిల్లులు, కుందేళ్లు, కోళ్లు, ఇతర వాటికి వైద్య సేవలందిస్తున్నాం. మందులను ఉచితంగా ఇస్తున్నాం. పెంపుడు కుక్కలకు కుటుంబ నియంత్రణ చికిత్స నిర్వహిస్తాం. నిరభ్యంతరంగా వైద్యంకోసం తీసుకురావచ్చు.

– డాక్టర్ రంగస్వామి, డిప్యూటీ డైరెక్టర్, బహుళార్థ పశువైద్యశాల, కడప

కాళ్లు సచ్చుబడడంతో..


నేను రూ.11వేలు పెట్టి తొమ్మిది నెలల క్రితం వేరే చోట లాబ్ రకం కుక్క కొనుగోలు చేశాను. నాలుగు రోజుల నుంచి వెనక కాళ్లు సచ్చుబడినట్లు సరిగా నడవటం లేదు. చెన్నూరు పశువుల ఆసుపత్రిలో చూపించా. వాళ్లు కడప వీపీసీకి రెఫర్ చేశారు. పరీక్షలు చేయించా. మందులిచ్చారు. వైద్యం చేయించిన తర్వాత కొంత మేలు.

– శ్రీనివాసులు, చెన్నూరు

మంచంపై నుంచి దూకి...


నేను ఆరు నెలల క్రితం కుక్కను కొనుగోలు చేశా. ఇటీవల మంచంపై నుంచి దూకడంతో దానికి కాలు నొప్పి పట్టింది. అది అన్నం సరిగా తినకుండా ఉంది. మాకు బాధగా ఉంది. వైద్య సేవల నిమిత్తం వీపీసీకి వచ్చాను. వైద్యులు పరిశీలించి సూది వేసి మందులిచ్చారు. ఇపుడు కుక్క ఆరోగ్యంగా ఉంటూ ఆహారం తీసుకుంటోంది.

– పెంచలయ్య, ఉపాధ్యాయుడు, కడప

తిండి సక్రమంగా తినడం లేదు...


నేను బొంబాయి నుంచి రూ.24 వేలు పెట్టి హిమాలయ క్యాట్ కొన్నాను. అది రెండు, మూడు రోజుల నుంచి తిండి సరిగా తినడం లేదు. దీంతో వైద్య పరీక్షలకు వచ్చా. వైద్యులు పరీక్షించి వ్యాక్సిన్ వేశారు. మందులిచ్చారు. అనంతరం పిల్లి కొద్ది కొద్దిగా భోజనం చేస్తోంది. వైద్యులు సకాలంలో స్పందించి టీకా వేశారు.

– అఫ్జల్, కడప

క్లుప్తంగా

మేయర్‌ను కలిసిన డిప్యూటీ కమిషనర్


డిప్యూటీ కమిషనర్ రాంబాబును ఆహ్వానిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థకు బదిలీపై వచ్చిన నూతన డిప్యూటీ కమిషనర్ రాంబాబు మేయర్ కె.సురేష్ బాబును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఆయనను కలిసి మొక్క అందజేశారు.

కార్యకర్తకు పరామర్శ


గాయపడిన మన్సూర్‌ను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఊటుకూరులో ఈ నెల 24వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మన్సూర్‌ను మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా శుక్రవారం పరామర్శించారు. స్థానిక హోలిస్టిక్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, జహీర్, దాసరి శివ, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

కడప రూరల్: దోమల కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. స్థానిక అగాడివీధిలో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు వివరించారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించడం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, వెంకటరెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎంకు ఆహ్వానం


అంజద్‌బాషాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సయ్యద్ షా అరీఫుల్లా హుస్సేనీ సాహెబ్

కడప కార్పొరేషన్: కడప నగరంలో ప్రసిద్ధి గాంచిన అమీన్‌పీర్ దర్గా(పెద్దదర్గా) ఉరుసుకు హాజరుకావాలని ఆ దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా అరీఫుల్లా హుస్సేనీ సాహెబ్ మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషాను శుక్రవారం ఆహ్వానించారు. బీకేఎం వీధిలోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో అజ్మతుల్లా, బన్నా తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం


శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వృక్ష శాస్త్ర విభాగం, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో కలుపు మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

28న ఆర్ట్స్ కళాశాలలో జాబ్ డ్రైవ్

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈ నెల 28వ తేదీన జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.జి. రవీంద్రనాథ్ తెలిపారు. కార్ప్ వన్ గ్లోబల్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ డ్రైవ్‌లో డిజిటల్ కస్టమర్ సపోర్ట్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు బయోడేటా, ఆధార్‌తో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను వెంట తీసుకు రావాలని సూచించారు. అర్హత కలిగిన వారు పూర్తి వివరాలకు జేకేసీ మెంటార్లు డా. ఎన్.సారథి 9347256400, రవీంద్రారెడ్డి 9390052901 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉత్సవాలపై సమీక్ష

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో నవంబర్ నెల 4వ తేదీ నుంచి నిర్వహించే కార్తీక మాసం ఉత్సవాలపై శుక్రవారం ఆలయ ఈఓ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రంకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ చల్లని దొర, తహసీలాపీఆర్ ఏఈ రహంతుల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజిబ్, అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే డెంగీ జ్వరాల నివారణ


జ్వరం వచ్చిన బాలుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ముద్దనూరు : ఈ ఏడాది ఏప్రిల్ నెలనుంచి ఇప్పటివరకు జిల్లాలో 35 డెంగీ కేసులను గుర్తించి చికిత్స అందించామని, అప్రమత్తతోనే డెంగీ జ్వరాలను నివారించవచ్చని జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖాధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక 6వ వార్డులో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి మాట్లాడారు. అపరిశుభ్రత వాతావరణం, పారిశుద్ధ్య లోపం వున్న ప్రాంతాలలో దోమల వ్యాప్తి చెందకుండా సంబంధిత అధికారులతో కలసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక 6వ వార్డులో 7 మందికి డెంగీ లక్షణాలు వున్నట్లు గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడా డెంగీ మరణాలు సంభవించలేదన్నారు. అనంతరం జ్వరాలబారిన పడి చికిత్స పొందుతున్న కుటుంబాలను సందర్శించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు లక్షుమయ్య, ప్రసాద్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పటిష్ట ఏర్పాట్లు

నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి


సైన్స్ మ్యూజియంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. కడప మున్సిపల్ స్టేడియం, జువెనైల్ హోం, సైన్స్ మ్యూజియం ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ స్టేడియంలో నవంబరులో నిర్వహించే ఆర్మీ ర్యాలీ కోసం చేపట్టిన పనులను కేటాయించిన సమయానికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జువెనైల్ హోమ్‌లో పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని, ఆర్వో వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వంట శాల, మ్యూజియంలో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, డీఈఈలు కిరణ్, బిఎల్.నరసింహ, నాగసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజంతోనే దేశ ప్రగతి

పవర్ గ్రిడ్ డీజీఎం హరి వెంకటకుమార్


విద్యార్థినులతో పవర్ గ్రిడ్ అధికారులు

వైవీయూ: అవినీతి రహిత సమాజంతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.హరివెంకటకుమార్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. డీజీఎం మాట్లాడుతూ రేపటితరం బాగుండాలంటే విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. అనంతరం వక్తృత్వ పోటీల విజేతలకు పవర్‌గ్రిడ్ అధికారులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ అధికారులు పి.వి. రాజశేఖర్, ఎం. ప్రమోద్, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న అశోక్‌ను అభినందిస్తున్న అతిథులు, తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని... ఆరోగ్యవంతులైన వారంతా రక్తదానం చేయాలని రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగే సేవా కార్యక్రమాల్లో భాగంగా కడప బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ రక్తం ఆవశ్యకత గుర్తించి శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత అపోహలు వీడి రక్తదానం చేయాలని కోరారు. సీఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు సునీల్‌జయంత్ మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో ఏర్పడే రక్త కొరతను అధిగమించేందుకు ఈ శిబిరాలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, కళావతి, వసంత, విజయ్, కాశి, ప్రేమ్ కుమార్, కళ్యాణి, రక్తదాతలు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరాలయానికి మెరుగులు


మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో పనులను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కడప కల్చరల్: కడప నగరంలోని ప్రముఖ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి భక్తుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కొందరు ధార్మిక వేత్తలు మెరుగులు దిద్దుతున్నారు. తొలి విడతగా ఆలయం ప్రహరీ లోపల పిచ్చి మొక్కలు తొలగించి 2–4 అడుగుల ఎత్తు మట్టి వేయనున్నారు. కార్తీక మాసంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంజనేయస్వామి ఆలయం, పునాదుల చుట్టూ మట్టి వేసి వర్షపు నిలవకుండా చేయడమేగాక, గోశాల శిథిలాలను తొలగించారు.

చిత్ర కళల్లో పికాసో చిరస్మరణీయుడు


తాము గీచిన చిత్రాలతో విద్యార్థులు

వైవీయూ: చిత్ర కళా రీతులలో కొత్త ఒరవడి సృష్టించిన పికాసో చిరస్మరణీయుడని వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. అంతర్జాతీయ చిత్రకారుల దినోత్సవం సందర్భంగా వైవీయూలో పికాసో జయంతి నిర్వహించి, ఆయన చిత్రాల సరళిపై వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుత్తా పద్మ మాట్లాడుతూ సామాజిక జీవనాన్ని ప్రతిబింబించేలా చిత్రాలు ఉంటే ప్రజలు ఆకర్షిస్తారన్నారు. ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక చిత్రకళకు ఆద్యుడు పికాసో అని, ఆఫ్రికన్ ఆర్ట్ నుంచి ఏ విధంగా స్ఫూర్తి పొందాడో వివరించారు. డాక్టర్ కోట మృత్యుంజయరావు పికాసో చిత్రాలపై డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం భారీ పికాసో చిత్రాన్ని విద్యార్థులు చిత్రీకరించారు. ఈ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య గంగయ్య , ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య కంకణాల గంగయ్య, బి.ఈరప్ప. బి.చినరాయుడు. ఎం.వాసవి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎ.మహాలక్ష్మి వైవీయూ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ చాంపియన్‌గా నిలవడంతో కళాశాల ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా అభినందించారు. ఇటీవల బద్వేల్ ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఆమె వైవీయూ చాంపియన్‌గా నిలవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.మదన్, సి.వి.కృష్ణవేణి, ఎం.వి.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారిణి మహాలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీ తదితరులు

పస్ట్ ర్యాంకు విద్యార్థి షేక్ జైబాకు ఉచిత విద్య

– కేఎస్ఆర్ఎం ఎండీ కె.చంద్ర ఓబుళరెడ్డి


కేజీపీజీ సెట్ 2024లో పస్ట్ ర్యాంకు సాధించిన షేక్ జైబాతో కందుల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్: కేఎస్ఆర్ఎం కేజీ, పీజీ సెట్–2ß24 సక్సెస్ మీట్‌ను శుక్రవారం కేఓఆర్ ఆడిటోరియంలో నిర్వహించారు. పస్ట్ ర్యాంకు సాధించిన షేక్ జైబాను కేఎస్ఆర్ఎం విద్యా సంస్థల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి అభినందించారు. ఆమెకు ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కార్పొరేట్ పోటీకి కావాల్సిన టెక్నికల్ అనాలసిస్ నాలెడ్జ్, బిజినెస్ కమ్యూనికేషన్ స్కిల్స్, అకాడమీ ఎక్స్‌లెన్స్ స్కిల్, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూనియర్లపై ర్యాగింగ్ చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్: విద్యా సంస్థల్లో జూనియర్ విద్యార్థులను సాదరంగా ఆహ్వానించాలేగానీ సీనియర్లు ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని న్యాయ సేవల ప్రాధికార సంస్థ సెక్రటరీ, సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ అన్నారు. కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ అబ్జర్వెన్స్ డే శుక్రవారం నిర్వహించారు. బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తు కాంక్షిస్తూ కళాశాలకు వచ్చిన విద్యార్థులు తమ కలలను నెరవేర్చుకునేందుకు కృషి చేయాలన్నారు. తెలిసీ తెలియక నేరాలు చేసి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ర్యాగింగ్‌తో కలిగే దుష్పలితాలు, విధించే శిక్షలను వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ ర్యాగింగ్ పూర్తిగా నిషిద్ధమని, సీనియర్లు, జూనియర్ల మధ్య ఆరోగ్యకరమైన చర్చ జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ్ భాస్కర్, ప్రొఫెసర్, హాస్టల్ వార్డెన్ డాక్టర్ సునీల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు దాసరి, వైద్య కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో శనగలో దిగుబడులు


రైతులకు శనగ విత్తనాలను అందచేస్తున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరన్న

కడప అగ్రికల్చర్: శనగ పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. కేవీకేలో బయోటెక్ కిసాన్ హబ్ పథకంలో భాగంగా రైతులకు ఎన్‌బిఇజి–776 శనగ రకం సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. వీరయ్య మాట్లాడుతూ ఎండు తెగులును బాగా తట్టుకునే రకం ఎన్‌బీఈజీ776 అని, సాగు చేసిన 95 నుంచి 105 రోజులలో పంట చేతికి వస్తుందని తెలిపారు. వర్షాధారంగా 7 నుంచి 9 క్వింటాళ్లు, మరియు ఒకటి రెండు నీటి తడులతో 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వివరించారు. ఎండు తెగులు మరియు వేరుకుళ్లు తెగుళ్లను అదుపులో ఉంచడానికి ఎకరాకు 2 కిలోల ట్రైకోడెర్మావిరిడి పొడిని నాలుగు కిలోల వేప చెక్కతో కలిపి 90–100 కిలోల పశువుల ఎరువులో 10–15 రోజుల వృద్ధి తర్వాత పొలంలో చల్లుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు ఎన్‌బిఇజి –776 రకం శనగలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ మహేష్‌బాబు, సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరిచ రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలి




మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యాలు ఓపీ పేరుతో వందల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని, వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క ఓపీకి(ఔట్ పేషెంట్)రూ.400, రూ.500 బోర్డులు పెట్టి వసూలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వివిధ రకాల టెస్టుల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. నగర కన్వీనర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

• కను రెప్పల చాటున లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్



అంధుల ప్రభుత్వోన్నత పాఠశాల వజ్రోత్సవాల సందర్భంగా నగరంలోని వివిధ పాఠశాలల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి అంధ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు వచ్చారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా ఆవరణలో సాక్షి తీసిన చిత్రాలివీ...

– రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగరంలోని బుట్టాయిపల్లి క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కడప బుడ్డాయిపల్లికి చెందిన ప్రభాకర్ కొండమ్మ అనే మహిళతో కలిసి ద్విచక్ర వాహనంలో నగరానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. బుడ్డాయిపల్లి క్రాస్ వద్ద స్కూటర్ మలుపు తిప్పుతుండగా ఎదురుగా వచ్చిన మరో స్కూటర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రభాకర్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు